సాక్షి
నిజామాబాద్
సోమవారం, 14, ఆగస్టు, 2023



వణికిస్తున్న వీధికుక్కలు

నగరంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి కారణంగా నగరవాసులు గాయాలపాలవుతున్నారు.

- 8లో ▸



ఊరిస్తున్న డబుల్ ఇళ్లు

బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ ఇళ్ల పంపిణీలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /24.7

ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంటుంది. సాయంత్రం మోస్తరు వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

వారి మాటలు నమ్మితే మళ్లీ పాత రోజులే..



కమ్మర్‌పల్లి: బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు నమ్మితే తెలంగాణలో మళ్లీ పాత రోజులే పునరావృతం అవుతాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వాళ్లు చేసే అబద్ధపు ప్రచారంతో మన బతుకులు ఆగమైపోతాయన్నారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు 3 గంటల కరెంట్ చాలు అంటున్నది, కేంద్రంలో ఉన్న బీజేపీ రైతుల మోటార్లకు మీటర్లు పెడతామంటున్నదని మండి పడ్డారు. తెలంగాణ కుటుంబానికి తండ్రిలాంటి వ్యక్తి కేసీఆర్ అని, ప్రజలకేమీ కావాలో ఆయనకు మాత్రమే తెలుసన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్‌పై రాసిచ్చిన అర్వింద్ రైతులకు గుండు చూపెట్టారంటూ మంత్రి వేముల ఘాటుగా విమర్శించారు. ఆయన మాటలు నమ్మి గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో కవితమ్మను ఓడగొట్టుకున్నామన్నారు. సీఎం కేసీఆర్ కంటే ముందు 10 ఏళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయని కాంగ్రెస్, ఇప్పుడు చేస్తుందంటున్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను విమర్శించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధ, సర్పంచ్ దేవయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు రేగుంట దేవేందర్, బడాల రమేష్‌రెడ్డి, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి రోడ్డు కోసం స్థల పరిశీలన



ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా రామాలయానికి కింది నుంచి గుట్టపైకి రోడ్డు వేసే స్థలం, మ్యాప్‌ను రూరల్ రోడ్లు తెలంగాణ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్ ఆదివారం పరిశీలించారు. ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ కవిత రామాలయాన్ని సందర్శించి పర్యాటక కేంద్రంగా తీర్చిద్దాలని సూచించారు. దీంతో ఆలయానికి రోడ్డు మార్గం వేసేందుకు రూ.5 కోట్లుతో ప్రతిపాదనలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. గతంలో యాదగిరిగుట్ట వద్ద పని చేసిన ఇంజనీర్ అధికారులను ఖిల్లా రామాలయానికి పంపించి ఆలయానికి రోడ్డు మార్గానికి కావాల్సిన మార్గాలపై నివేదికలు సిద్ధం చేస్తామని రూరల్ రోడ్లు తెలంగాణ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ తెలిపినట్లు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ, నాయకులు జైపాల్, కృష్ణారెడ్డి, యాదగిరి,వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.


నేడు కామారెడ్డి జిల్లాకు కేటీఆర్ రాక



సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ సోమవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి పట్టణాల్లో జరిగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో మంత్రి పాల్గొననున్నారు. కేటీఆర్ ప్రగతి భవన్ నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. 11 గంటలకు 44వ నంబరు జాతీయ రహదారిపై నర్సన్నపల్లి వద్ద నిర్మించిన స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తారు. నర్సన్నపల్లి నుంచి టేక్రియాల్ వరకు నిర్మించిన ఆరు వరుసల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌ను హౌసింగ్ బోర్డు వద్ద, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద ప్రారంభిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు తాడ్వాయి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో నిర్మించనున్న స్టేడియంకు శంకుస్థాపన చేస్తారు. 12.45 గంటలకు ఎల్లారెడ్డి పట్టణంలో రూ.8.54 కోట్లతో నిర్మించిన బ్రిడ్జి, రోడ్లను ప్రారంభిస్తారు. రూ.4.20 కోట్లతో నిర్మించతలపెట్టిన ఆర్టీసీ బస్టాండ్‌కు శంకుస్థాపన చేస్తారు. రూ.10 కోట్లతో ఎల్లారెడ్డి పట్టణంలో నిర్మించతలపెట్టిన రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేస్తారు. అలాగే రూ.2 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.4 కోట్లతో నిర్మించతలపెట్టిన మున్సిపల్ భవనానికి శంకుస్థాపన చేస్తారు. చిల్డ్రన్స్ పార్కును మంత్రి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ స్కూల్ పక్కన గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగిస్తారు.

గృహలక్ష్మి కొందరికేనా!

- ప్రభుత్వ మార్గదర్శకాలపై దరఖాస్తుదారుల్లో నెలకొన్న అసంతృప్తి
- రేషన్ కార్డులో పేరు లేకపోతే లబ్ధిదారుగా ఎంపిక కష్టమే..
- ఏ ఊరిలో ఇల్లు కట్టుకుంటారో అక్కడి ఆధార్, ఓటరు కార్డు ఉండాల్సిందే
- లబ్ధిపొందేవారి పేరునే ఇంటి స్థలం ఉండాలనే నిబంధన



మోర్తాడ్(బాల్కొండ) : గృహలక్ష్మి పథకం అమలు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, జారీ చేసిన మార్గదర్శకాలకు పొంతన లేకపోవడంతో ఈ పథకం ద్వారా లబ్ధి పొందేవారి సంఖ్య తగ్గిపోనుందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. గృహలక్ష్మి కటాక్షం అందరికీ వర్తించే అవకాశం లేదని మార్గదర్శకాలను పరిశీలిస్తే స్పష్టమైతుంది. సొంతంగా జాగా ఉండి ఇంటిని నిర్మించుకునేవారికి రూ.3 లక్షల సాయం ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందు కోసం 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,350 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ప్రతి నియోజకవర్గంలో 3 వేల చొప్పున ఇండ్లు నిర్మించడానికి సాయం ప్రకటించారు. మార్గదర్శకాల ప్రకారం అందరూ దరఖాస్తుదారులు లబ్ధిదారులు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

- సాధారణంగా ఇంటి యజమాని పేరుపై స్థలం ఉంటే ఆ వ్యక్తి భార్య లేదా తల్లి పేరిట ఇంటి నిర్మాణానికి సాయం మంజూరు చేస్తారు. గృహలక్ష్మి ఉత్తర్వులలో మాత్రం లబ్ధిపొందేవారి పేరున ఇంటి స్థలం ఉండాలని నిర్దేశించారు. గృహలక్ష్మి పథకం మాత్రం మహిళలకే వర్తించేలా నిబంధనలు విధించారు. అంటే ఇంటి స్థలం ఒకరి పేరున ఉంటే లబ్ధిదారుగా మరొకరు ఎంపికయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.
- లబ్ధిదారు పేరు తప్పనిసరిగా ఆహార భద్రత కార్డులో నమోదై ఉండాలనే నిబంధన ఉంది. దాదాపు ఏడేళ్ల నుంచి రేషన్ కార్డులలో కొత్తవారి పేర్లు నమోదు చేయడం లేదు. ఎవరైనా యువతి పెళ్లి చేసుకుని అత్తారింట్లో అడుగు పెడితే ఆమె పేరు ఆహార భద్రత కార్డులో నమోదు కాకపోతే గృహలక్ష్మి పథకం వర్తించే అవకాశం లేదు.
- ఓటరు కార్డు, ఆధార్ కార్డు లబ్ధి పొందే గ్రామానికి సంబంధించిన చిరునామా చూపేదిగా ఉండాలి. ఓటరు కార్డు, ఆధార్ కార్డులలో చిరునామా సరి చేసుకునే అవకాశం ఉంది కాబట్టి దీనితో ఇబ్బంది లేదు.
- ఇంటి స్థలం లబ్ధి పొందేవారి పేరునే ఉండాలనే నిబంధనతో పాటు ఆహార భద్రత కార్డులో పేరు తప్పనిసరి అనే విధానం వల్ల లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఏది ఏమైనా గృహలక్ష్మి పథకం అందరిని కటాక్షించే పరిస్థితి లేదని చెప్పవచ్చు.

■ మోర్తాడ్‌కు చెందిన టి సుజాత గృహలక్ష్మి పథకం కింద లబ్ధి పొందడానికి తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి సంబంధించిన ఖాళీ స్థలం ఆమె భర్త పేరున ఉంది. గృహలక్ష్మి పథకం ఉత్తర్వులలో మాత్రం లబ్ధిదారు పేరునే స్థలం ఉండాలనే నిబంధన ఉంటంతో ఆమెకు గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూరుతుందో లేదో అనే సందేహం వ్యక్తమైతుంది. ఇది ఒక్క సుజాతకు ఎదురైన సమస్యనే కాదు. ఎంతో మంది దరఖాస్తుదారులకు కలుగుతున్న ఇబ్బంది.

నిబంధనలు సవరించాలి



గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి సాయం అందించే నిబంధనలను సవరించాలి. లబ్ధిదారు ఎవరైనా ఇంటి స్థలం వారి కుటుంబ సభ్యుల పేరుపై ఉంటే సరిపోతుంది. అలాగే రేషన్ కార్డులలో పేర్లు నమోదు చేయకుండా గృహలక్ష్మి పథకం లబ్ధి చేకూర్చాలంటే ఆహార భద్రత కార్డు తప్పనిసరి అనే నిబంధన తొలగించాలి. ప్రభుత్వానికి సాయం అందించే ఉద్దేశం లేదు కాబట్టి కఠిన నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్యను కుదించేందుకు పావులు కదుపుతోంది.

– సోమ పెద్ద రాజారెడ్డి, సర్పంచ్, గుమ్మిర్యాల్

మెడికల్ దుకాణాలుగా సొసైటీలు



దొంకేశ్వర్ సహకార సంఘం

- తక్కువ ధరకే జనరిక్ ఔషధాల విక్రయం
- జిల్లా నుంచి ఐదు సొసైటీల పేర్లు పంపిన సహకార శాఖ
- ప్రభుత్వ అనుమతి రాగానే ఏర్పాటు

డొంకేశ్వర్ (ఆర్మూర్): సహకార సొసైటీలు మెడికల్ దుకాణాలుగా రూపాంతరం చెందనున్నాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయాలను చేపడుతున్న సొసైటీలు తమ వ్యాపార విస్తరణ కోసం జనరిక్ మందులను అమ్మనున్నాయి. జిల్లాలో మొత్తం 89 సొసైటీలున్నాయి. అయితే, ప్రయోగాత్మకంగా జిల్లాలో కొన్ని సొసైటీల ద్వారా జనరిక్ మందుల విక్రయం ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు జిల్లా నుంచి ఐదు సొసైటీల పేర్లను పంపాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. దీంతో జిల్లా సహకార శాఖ అధికారులు పట్టణాలకు దగ్గరగా, అమ్మకాలకు అనువైన మండల కేంద్రాల్లోని సొసైటీలను వెతికారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున సొసైటీని ఎంపిక చేశారు.

ఎంపికైన సొసైటీలు

ఆర్మూర్ నుంచి డొంకేశ్వర్, బాల్కొండ నుంచి భీమ్‌గల్ మండలం మోతె, బోధన్ నుంచి బోధన్ సొసైటీ, నిజామాబాద్ రూరల్ నుంచి సిరికొండ, బాన్సువాడ నుంచి చందూర్ సొసైటీ ఉన్నాయి. వీటికి త్వరలోనే ప్రభుత్వం నుంచి అనుమతి రానున్నట్లు శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే జనరికల్ మెడికల్ దుకాణాలు సొసైటీ భవనంలోనే కాకుండా మండల పరిధిలో ఏ చోటనైనా పెట్టుకునేందుకు అవకాశం ఉంది.

ప్రజలకు అందుబాటులో..

జనరిక్ మెడికల్ దుకాణాల నిర్వహణ మొత్తం సంబంధిత సొసైటీలదే ఉంటుంది. ఔషధాల కొనుగోలు, ఇతర ఖర్చులకు సొసైటీ నిధులను వినియోగిస్తారు. లాభాలు పొందడమే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి తక్కువ ధరకే మందులను విక్రయించాలనేది ప్రధాన ఉద్దేశం. మార్కెట్‌లో సాధారణ మెడికల్ దుకాణాల్లో కంటే 60 శాతం తక్కువ ధరకు జనరిక్ మెడికల్‌లో నాణ్యమైన మందులు లభించనున్నాయి.
జిల్లాలో ఐదు సొసైటీల్లో చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతమైతే అన్ని సొసైటీల పరిధిలో జనరిక్ మెడికల్ జనరిక్ దుకాణాలను తెరవనున్నారు.

పేర్లు పంపించాం

రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఆసక్తి గల ఐదు సహకార సొసైటీల పేర్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున పంపించాం. ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసి జనరిక్ మెడికల్ దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే ముందుముందు మరిన్ని సొసైటీలకు అనుమతి వచ్చే అవకాశముంది.

– సింహాచలం, డీసీవో, నిజామాబాద్

మార్పు కోసమే రాజకీయ రంగ ప్రవేశం

- ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే ప్రజాగొంతుకనవుతా..
- నియోజక వర్గ అభివృద్ధి వెనుకబాటు, సమస్యలే స్ఫూర్తినిచ్చాయి
- విద్యావంతుడు పుట్ట గణేశ్ గౌడ్



మాట్లాడుతున్న పుట్ట గణేశ్ గౌడ్

బోధన్: నియోజక వర్గ అభివృద్ధి, ప్రజల స్థితిగతుల మార్పు కోసమే తాను రాజకీయ రంగంలో అడుగు పెడుతున్నాని బోధన్‌కు చెందిన విద్యావంతుడు పుట్ట గణేశ్ గౌడ్ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్ ఎమ్మెల్యే స్థానానికి సొతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నాని తెలిపారు. తాను బోధన్ లో వ్యవసాయ, వ్యాపార, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టి, పెరిగి ఇక్కడే చదువుకున్నానని, ఈ ప్రాంత ప్రజలకు నీతి, నిజాయితీగా సేవ చేసేందుకు, వారి సమస్యల పరిష్కారం కోసం రాజకీయ అధికారం అవసరమని గుర్తించానన్నారు. డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో 25 ఏళ్లుగా విద్యారంగంలో వివిధ హోదాల్లో పని చేశానన్నారు. తన చిన్నాన్న దివంగత రామాగౌడ్ గతంలో మున్సిపల్ చైర్మన్‌గా సేవలందించారని గుర్తు చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్‌లో ఎన్నికల కార్యాలయాన్ని స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధులతో కలిసి ప్రారంభించారు. గణేశ్ గౌడ్ మాట్లాడుతూ గడిచిన దశాబ్దాల కాలంలో అనేక ప్రభుత్వాలు, నాయకులు మారినా భవిష్యత్ తరం అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి జరుగలేదన్నారు. ఈప్రాంతం అభివృద్ధిలో వెనుకబాటు, ప్రజల సమస్యలే రాజకీయాల్లో వచ్చేందుకు స్ఫూర్తి నిచ్చాయన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ నడిచే సమయంలో చెరుకు తోటలతో సస్యశ్యామలంగా ఉండేదని, ఇప్పుడు పరిస్థితి తారుమారైందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తానంటే ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెడుతారని కొందరు తనను అడిగారని, కాని రూ. కోట్లు ఖర్చు పెట్టి గెలిచిన అనంతరం పదిరెట్లు సంపాదించుకునే వైఖరితో లేనన్నారు. లక్ష్మీ పుత్రుడిని కాదు, సరస్వతి పుత్రుడినన్నారు.

త్వరలో ఎన్నికల మేనిఫెస్టో

నియోజక వర్గ ప్రజలు ఆదరించి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే, ఈ ప్రాంత ప్రజల గొంతుకవుతానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. మూతపడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీ తిరిగి తెరిపించేందుకు, పటిష్టమైన విద్య, వైద్య సౌకర్యాలు, రైతు, కూలీల, కార్మికుల అభ్యున్నతి, సంక్షేమం కోసం పోరాడుతానన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికల పూర్తిస్థాయి మేనిఫెస్టోను త్వరలోనే విడుదల చేస్తానన్నారు.

నాణ్యత లోపం.. రోడ్లు ధ్వంసం

- అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం
- వృథా అవుతున్న ప్రజాధనం



మోర్తాడ్ నుంచి వడ్యాట్ వెళ్లే మార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంత



దొన్కల్ నుంచి స్వర్ణపు వాగు మీదుగా పోచంపల్లి వెళ్లే మార్గంలో కూలిన వంతెన

మోర్తాడ్(బాల్కొండ): రోడ్లు, వంతెనల నిర్మాణంలో నాణ్యత లోపం వల్ల నిర్మించిన కొన్నిరోజులకే నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే అని పలువురు విమర్శిస్తున్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, ఏర్గట్ల, వేల్పూర్, బాల్కొండ తదితర మండలాల్లోని పలు వంతెనలు, రోడ్లను పరిశీలిస్తే వీటి నిర్మాణంలో కాంట్రాక్టర్లు ఎంతటి శ్రద్ధ కనబరిచారో వెల్లడవుతుంది. దొన్కల్ నుంచి పోచంపల్లి మీదుగా బాల్కొండకు వెళ్లే మార్గంలో స్వర్ణపు వాగుపై నాలుగేళ్ల కింద వంతెన నిర్మించగా అది గత ఏడాది కూలిపోయింది. వంతెనకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయకుండా అప్రోచ్ రోడ్డు నిర్మించగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాగు ఉప్పొంగి పూర్తిగా నేలమట్టమైంది. అలాగే వడ్యాట్, మోర్తాడ్‌ల మధ్య ముసలమ్మ చెరువు కాలువపై నిర్మించిన కల్వర్టు నాసిరకంగా ఉండటంతో రోడ్డు కుంగిపోయింది. రోడ్డుపై ఏర్పడిన గుంతను వాహనదారులు గమనించకుండా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇలా అన్ని మండలాల్లో రోడ్లు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణం నాసిరకంగా సాగడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాణ్యత లేని పనులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

కాంట్రాక్టర్లు, అధికారులు బాధ్యత వహించాలి



నాణ్యతలేని పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు, అధికారులే బాధ్యత వహించాలి. కమీషన్లకు కక్కుర్తిపడి పనుల్లో నాణ్యత లేకుండా చేశారు. ఎంతో కాలం మనుగడ సాగించాల్సిన రోడ్లు, వంతెనలు వర్షాలకు దెబ్బతింటే ఎలా. ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎవరు బాధ్యులో చెప్పాలి.

– ముత్యాల రాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోర్తాడ్

మండల సమావేశంలో చర్చిస్తాం



నాణ్యత లేని పనులపై మండల సమావేశాల్లో చర్చిస్తాం. మండల సమావేశంలో పక్కాగా తీర్మానం చేయించి బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తాం. ప్రజా ధనాన్ని పక్కదారి పట్టించిన వారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, ఎంపీటీసీ, సుంకెట్

అడిగినంత ఇస్తేనే లెక్కలు క్లియర్

- లేదంటే అభ్యంతరాలు చూపి రికవరీకి చర్యలు
- పంచాయతీల ఆడిటింగ్‌లో అధికారుల చేతివాటం



మోర్తాడ్ (బాల్కొండ): పంచాయతీల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆడిటింగ్ పూర్తి చేసిన అధికారులు ముడుపుల కోసం వేధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అభ్యంతరాలు వ్యక్తం చేయవద్దంటే తాము అడిగినంత ఇవ్వాలని సర్పంచ్‌లను, పంచాయతీ కార్యదర్శులను ఆడిట్ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారని తెలుస్తోంది. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్, ఏర్గట్ల మండలాల్లోని పంచాయతీల్లో ఆడిటింగ్ పూర్తిచేసిన ఉద్యోగులు కొందరు వసూళ్లకు తెరలేపారని సమాచారం. మేజర్ పంచాయతీల నుంచి రూ.60 వేలు మొదలుకొని రూ.80వేలు, చిన్న పంచాయతీల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. పంచాయతీలకు పన్నుల ద్వారా లభించే ఆదాయం, కేంద్ర ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ల ద్వారా లభించే నిధులతో చేపట్టిన పనులకు చేసిన ఖర్చులు సరైనవా కాదా అని ఆడిటర్లు రికార్డులను పరిశీలించారు. పంచాయతీల ద్వారా జరిగిన ఖర్చులకు సంబంధించిన బిల్లులు ఉన్నాయో లేవో సరిగా చూసి పంచాయతీరాజ్ శాఖకు నివేదికను అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆడిటర్లు కొందరు వసూళ్లు చేసినట్లు సర్పంచ్‌లు, కార్యదర్శులు చెబుతున్నారు. ఆడిటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సొమ్ము మళ్లీ పంచాయతీలకు జమ చేయాల్సి ఉంటుంది. అందువల్ల ఆడిటర్లకు ఎంతో కొంత ఇచ్చుకుని తమ పనులు చక్కదిద్దుకున్నామని ప్రజాప్రతినిధులు వెల్లడించారు. ఈ విషయమై ఆడిటింగ్ చేసిన ఉద్యోగులను 'సాక్షి' సంప్రదించగా అదేమి లేదని కొట్టిపారేశారు. తాము ముడుపులుగా ఇచ్చిన సొమ్ము ఎలా ఖర్చు చూపాలో తెలియడం లేదని తాము సొంతంగా భరించాల్సి వస్తుందని సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో సీతారామచంద్రస్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆదివారం సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ప్రముఖ పండితులు నరసింహ స్వామి బృందంచే ఘనంగా జరిగింది. భక్తులు స్వామివారు ఎదుర్కొవటం కల్యాణ మహోత్సవం, అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకట్టుకునేలా సుందరకాండ పారాయణం నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టాభిషేకం, పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కల్యాణ దాత నవలత రాంకిషన్ రావు దంపతులు, నగర మేయర్ దండు నీతూ కిరణ్, టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, ఆలయ కన్వీనర్ కొండవీటి శేఖర్‌గుప్త, చంద్రశేఖర్, తాటి విరేశం గుప్త తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట



గోదాం నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలు అందజేస్తున్న బాజిరెడ్డి

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నగర శివారులోని బోర్గాం(పి) సొసైటీ గోదాం నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు పత్రాలను హైదరాబాద్‌లోని తన నివాసంలో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని రైతాంగాన్ని ఆదుకునేందుకు, వారి ఆదాయాన్ని పెంచేందుకు, సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, పంటలకు మద్దతు, గోదాముల నిర్మాణం, సాగునీరు, తదితర అనేక పథకాలు అమల్జేస్తున్నారని గుర్తు చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమల్జేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ జయకృష్ణ, డైరెక్టర్లు దాసు, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షటిల్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



నిజామాబాద్ నాగారం: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–11, 13, 15 విభాగాల్లో ఆదివారం జిల్లాస్థాయి టోర్నీ మోపాల్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఇందులో బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా, విన్నర్, రన్నర్‌లకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యక్షుడు కర్నాటి వాసు, కార్యదర్శి కిర ణ్‌కుమార్, శ్రీకాంత్, గంగాధర్, కోచ్ వెంకటేష్, సాయిచరణ్, ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ ఫౌండర్ నవనీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి చెస్ క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–11 బాలబాలికల విభాగంలో జిల్లాస్థాయిలో చెస్ పోటీలు నిర్వహించారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోని అభ్యాస స్కూల్‌లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 19, 20 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రతినిధులు రమేశ్, గంగాధర్, సుధీర్, ఆర్బిటార్ బ్రహ్మానంద్, పీఈటీ మురళి ఉన్నారు.

వణికిస్తున్న వీధి కుక్కలు

- ఏటేటా పెరుగుతున్న శునకాల సంఖ్య
- రోజూ నగరంలో ఏదోఒకచోట ప్రజలపై దాడులు
- కు.ని. ఆపరేషన్లకు ఏటా రూ. 25 లక్షలు మంజూరు
- నిధులు దుర్వినియోగం అయ్యాయని కార్పొరేటర్ల ఆరోపణ



38వ డివిజన్‌లో కుక్క వల్ల గాయపడ్డ యువకుడు



నగరంలోని సాయినగర్ -3లో బాలుడిని కరుస్తున్న వీధికుక్క

నగరంలోని 38వ డివిజన్‌లో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డు మీద నడుచుకుంటు వెళ్తున్న యువకుడిపై ఆదివారం దాడి చేసి కాలిని కరిచాయి. చుట్టు పక్కల వారు అరుస్తు తరమడంతో అవి అక్కడినుంచి పారిపోయాయి. లేకపోతే యువకుడికి మరిన్ని గాయాలయ్యేవి. పెద్ద ప్రమాదం తప్పిందంటూ కుటుంబసభ్యులు యువకుడిని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.

నగరంలోని సాయినగర్‌లో ఆదివారం ఓ బాలుడు ఇంటి ఎదుట ఆడుకుంటుంటే ఓ కుక్క వచ్చి పిల్లవాడి ముందు భాగంలో కరిచేందుకు ప్రయత్నించింది. కొద్దిసేపటి తర్వాత ఎదురింటి యువకులు ఇంట్లో నుంచి బయటకు రావడంతో కుక్క పారిపోయింది. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఈ వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

నిజామాబాద్‌నాగారం : మున్సిపల్ శాఖ ద్వారా కుక్కలకు కుటుంబ నియంత్రణ కోసం రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నా వాస్తవికంగా వాటి ఉపయోగం ఏమీ లేకుండా పోతోంది. రోజురోజుకూ కుక్కల సంతతి నగరంలో వేగంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది కుక్కలకు కు.ని ఆపరేషన్ల కోసం రూ. 25 లక్షలు కేటాయించగా 3 వేల వరకు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా రూ. 25 లక్షలపైనే కేటాయించగా సుమారు మూడు నెలల పాటు కుటుంబ నియంత్రణ చేసి మమ అనిపించారు. కాని కుక్కల సంతతి క్రమంగా పెరుగుతూనే ఉంది. నగరంలో రోజుకొక సంఘటన జరగడం సాక్ష్యంగా చెప్పవచ్చు. ఒక్క ఆదివారమే వేరువేరు ప్రాంతాల్లో కుక్కల దాడులు జరిగాయి. అంటే కుక్కలకు ఆపరేషన్లు చేయడంలో ఏమైనా లోపం జరిగిందా.. అసలు ఆపరేషన్లు చేశారా.. అనేదానిపై నగరవాసులు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిధుల ఖర్చుపై కాకిలెక్కలు..

కుక్కల కుటుంబ నియంత్రణ కోసం గత ఏడాది రూ. 25 లక్షలు ఖర్చు చేశామని మున్సిపల్‌శాఖ బడ్జెట్ సమావేశంలో ఖర్చు చేశామని చెప్పడంపై కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్ మండిపడ్డారు. వేల సంఖ్యలో కుక్కలు ఉంటే కేవలం వందల సంఖ్యలో కుక్కలకు ఆపరేషన్లు చేసి అధికారు లు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. అందుకే నగరంలో కుక్కల బెడద రోజు రోజుకు తీవ్రంగా పెరిగిపోతుందంటున్నారు.

అధికారుల మౌనం..

కుక్కల నియంత్రణ కోసం నిధులు ఏ విధంగా ఖర్చు చేశారో వివరాలు చెప్పాలని పలుమార్లు ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీను ప్రశ్నించగా సమాధానం దాటవేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై వివరణ కోసం పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు.

వేలల్లో కుక్కలు.. వందల్లో ఆపరేషన్లు

నగరంలో 60 డివిజన్ల పరిధిలో కుక్కలకు కుటుంబ నియంత్రణ కోసం ఈ ఏడాది మే,జూన్ నెలలో ప్రత్యేకంగా కార్యచరణ రూపొందించారు. డాగ్‌స్క్వాడ్ బృందాన్ని పిలిపించారు. కుక్కలకు ఆపరేషన్‌లకు కోసం డాక్టర్లను సైతం ఏర్పాటు చేశారు. రోజుకు పదుల సంఖ్యలో కుక్కలను ప ట్టుకొని ఆపరేషన్లు చేసి చేతులు దులుపుకున్నారు. నగరంలో వేల సంఖ్యలో కుక్కలు ఉంటే కేవలం వందల సంఖ్యలో ఆపరేషన్లు చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అందుకే నగరంలో కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. నగరంలోని ఆనంద్‌నగర్, చంద్రశేఖర్, ఆర్యనగర్, సాయినగర్, గాయత్రినగర్, గంగాస్థాన్, మారుతీనగర్, దుబ్బ, గౌతంనగర్, మాలపల్లి, ఆటోనగర్, అర్సపల్లి, వర్నిరోడ్, నాగారం, వినాయక్‌నగర్ కాలనీల్లో కుక్కలు అధికంగా ఉన్నాయి.

ఊరిస్తున్న 'డబుల్' ఇళ్లు..!

- లక్కీ డ్రా తీశారు.. పంపిణీ మరిచారు
- నిర్మించి వదిలేసిన అధికారులు
- వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు



బాల్కొండలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

బాల్కొండ: సొంతింటి కల నెరవేరబోతోంది.. త్వరలోనే గృహప్రవేశం చేస్తామంటూ ఆశపడ్డ లబ్ధిదారులకు అధికారులు మొండిచేయి చూపిస్తున్నారు. బాల్కొండలో ఎనిమిది నెలలుగా డబుల్ బెడ్ ఇళ్ల లబ్ధిదారులను డబుల్ పంపిణీ కార్యక్రమం వాయిదా పడుతూ వస్తోంది. బాల్కొండ మండల కేంద్రంలో ఐదేళ్ల తర్వాత ఎట్టకేలకు 100 డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేశారు.

గత జనవరిలో సంక్రాంతి పండుగకు ఇళ్ల పంపిణీ నిర్వహిస్తామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రచారం చేశారు. కాని ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటిదాకా వాటికి అతీగతీ లేకుండా పోయింది. గత నెలలో ఇళ్ల పంపణీ కోసం లక్కీ డ్రా కూడా నిర్వహించారు. ఆగస్టులో పంపిణీ చేస్తామన్నారు. ఆగస్టు సగం నెల గడిచినప్పటికీ వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఎప్పుడు పంపిణీ చేస్తారని లబ్ధిదారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

పనులు ఇంకా పెండింగ్‌లోనే..

బాల్కొండ మండల కేంద్రం శివారులో 100 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారు. 2017లో పనులకు శంకుస్థాపన చేశారు. పనులను గతేడాది డిసెంబర్‌లో పూర్తి చేశారు. కాని ప్రస్తుతం ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్లకు నీటి సరఫరా చేసేందుకు కావాల్సిన వాటర్ ట్యాంకు నిర్మాణం ఇంకా అసంపూర్తిగానే ఉంది. పైపులైన్ పనులను పూర్తి చేయలేదు. స్వాగత తోరణం పనులను కూడా మధ్యలోనే నిలిపేశారు. ఇవన్ని ఆగస్టులో పూర్తయ్యే అవకాశం లేదు. కాని అధికారులు మాత్రం ఆగస్టులో పంపిణీ చేస్తామంటూ పేర్కొనడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

461 మంది దరఖాస్తు..

బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించిన 100 డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం 461 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనికోసం గత నెలలో లక్కీ డ్రా నిర్వహించారు. కాని అర్హులకు కాకుండా డబ్బులిచ్చిన వారికే ఇళ్లు వచ్చేలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల్లో జాబితా ప్రకటిస్తామన్నారు. ఇప్పటివరకు నిజమైన లబ్ధిదారుల జాబితా ఎక్కడో కూడా ప్రకటించలేదు. అర్హులకు ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

" నెలాఖరు వరకు పూర్తిచేస్తాం

డబుల్ ఇళ్ల వద్ద అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తాం. ఇళ్ల పంపిణీ కూడా త్వరలోనే ఉంటుంది. షెడ్యూల్ ప్రకారంగా మండలాల వారిగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– రవీందర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ, బాల్కొండ

అపూర్వం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం



న్యాల్‌కల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో ఎస్సెస్సీ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి

ఖలీల్‌వాడి: రాష్ట్రంలోని యూనివర్సిటీలలో విద్యార్థి సంఘ ఎన్నికలను నిర్వహించాలని ఓయూ రీసర్చ్‌స్కాలర్ ఆర్ఎల్ మూర్తి అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ విస్తృత స్థాయి సమావేశం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి సంధ్యారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం -2020 ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసి విదేశీ యూనివర్సిటీలను తీసుకురావడం దారుణమన్నారు. రెగ్యులర్ వీసీని నియమించాలని, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఉన్న వాకటి కరుణ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కరుణించాలన్నారు. వర్సిటీ నూతన కార్యదర్శిగా వెంకటేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కర్యదర్శులు రాచకొండ విఘ్నేష్, అనిల్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు సంధ్య రెడ్డి, సాయి ప్రసాద్, సహాయ కార్యదర్శులు దినేష్, ఆదిత్య, చాత్రు,చరణ్ తదితరులున్నారు.

ఇండియన్ సైకియాట్రిక్ సమావేశానికి విశాల్



రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగిన క్లినికల్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న వైద్యుడు విశాల్

నిజామాబాద్ సిటీ : రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఆదివారం జరిగిన ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సమావేశంలో వైద్యుడు డాక్టర్ విశాల్ పాల్గొన్నారు. ప్రతి ఏడాది కొత్త క్లినికల్ ప్రాక్టీస్ మార్గదర్శకాలను సొసైటీ విడుదల చేస్తుంది. 2024కు గాను కొత్త క్లినికల్ ప్రాక్టీస్ మార్గదర్శకాలను రూపొందించడానికి దేశవ్యాప్తంగా 40 మంది నిష్ణాతులైన వైద్యులను రాజస్థాన్‌లోని జైపూర్‌కు సొసైటీ ఆహ్వానించింది. వీరు కొత్త మార్గదర్శకాలను రూపొందించనున్నారు. ఆ సదస్సులో వైద్యుడు విశాల్, అరబింద బ్రహ్మ కూడా ఉన్నారు.

చేపల వల చుట్టుకుని జాలరి మృతి



బాన్సువాడ రూరల్ : మండలంలోని ఇబ్రాహింపేట్ గ్రామానికి చెందిన కామబోయి(60) అనే మత్స్యకార్మికుడు శనివారం రాత్రి గ్రామంలోని చెరువులో చేపల వేటకు వెళ్లి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటమునిగి మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతుని భార్య చంద్రవ్వ ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం గ్రామానికి చెందిన గుండెనెమ్లి సంతోష్‌తో కలిసి తన భర్త చేపల వేటకు వెళ్లాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాసేపటికి సంతోష్ ఇంటికి వచ్చినా తన భర్తమాత్రం రాలేదని, చెరువు గట్టుపై దుస్తులు ఉండటంతో అనుమానంతో చెరువులో జాలర్లతో వెతికించగా ఆదివారం మృతదేహం లభించిందన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

నిజామాబాద్ సిటీ: రూరల్ మండలం శ్రీనగర్‌లో ఓ ఇంట్లో పేకాడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకుని అరెస్టు చేశారు. శ్రీనగర్‌లో మస్తాన్‌రావు ఇంట్లో కొంతమంది పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఇందులో మస్తాన్‌రావు, సంజీవ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, బొందుగుల శ్రీనివాస్, ఆనంద్‌లు పోలీసులకు చిక్కారు. వీరినుంచి రూ. 70,110లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని నిజామాబాద్ రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ ఎస్‌హెచ్‌ఓ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం మండలంలోని గొట్టిముక్కల శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి రూ. 20,650,10, సెల్‌ఫోన్లు, కారు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటాడుతున్న 10మందిని అరెస్ట్ చేసి మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. ఏసీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్ సిబ్బందితో కలిసి స్థావరంపై దాడి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ 63వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను అంబులెన్సు వాహనంలో ఆర్మూర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

క్రైం కార్నర్

ఒకరి ఆత్మహత్య



మాణిక్యం (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన పారుకల మాణిక్యం (28) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన పారుకల మాణిక్యం నాలుగేళ్ల క్రితం ఎల్లారెడ్డి పల్లి గ్రామానికి ఇల్లరికంగా వెళ్లాడన్నారు. స్వగ్రామంలో తల్లితండ్రుల ఆస్తి 14 గుంటల భూమి ఉండగా దానిని సాగు చేసుకునేందుకు మూడు రోజుల క్రితం శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి వచ్చాడన్నారు. ఆదివారం గ్రామ శివారులోని కొయ్యగుట్టలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్ విద్యుత్ లైన్‌మన్ మృతి



గంగారాం (ఫైల్)

భిక్కనూరు : మండల కేంద్రంలోని రిటైర్డ్ విద్యుత్ లైన్‌మన్ గడ్డం గంగారాం (61) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన కొన్ని రోజులగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన అంత్యక్రియల్లో విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిదులు, నేతలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

కుక్కల దాడిలో లేగదూడ..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో సంకరి వెంకట్ రాములుకు చెందిన లేగదూడపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. ఇటీవల వెంకట్ రాములుకు చెందిన గిరిరాజ కోళ్లను కూడా కుక్కలు కరిచి చంపేశాయన్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, బెడదను నివారించాలని బాధిత రైతు అధికారులను వేడుకుంటున్నాడు. మృతి చెందిన దూడను పశువైద్య గణ సహాయకుడు జుగల్ కిషోర్ పరిశీలించారు.

మద్దెల చెరువు సర్పంచ్..



పండిత్ రావ్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెల చెరువు గ్రామం సర్పంచ్ పండిత్ రావ్ (52) శనివారం రాత్రి మృతి చెందారు. సర్పంచ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అప్పటి నుంచి అనారోగ్యానికి గురైన ఆయన శనివారం రాత్రి మృతి చెందారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే హన్మంత్ షిందే, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి శివారు మమ్మోడి ఆయా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మహిళ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ధర్పల్లి మండలంలో ఎస్‌బీ జమేదార్‌గా పని చేస్తున్న పోతుల సాయిలు రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఉన్న తన చెల్లెలు ఇంటికి బైక్‌పై భార్య సుమిత్ర (47)ను తీసుకుని వస్తుండగా దూపల్లి వద్ద ప్రమాదం జరిగింది. ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనకాల కూర్చున్న సుమిత్ర తలకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తీవ్ర రక్తస్రావమైన ఆమెను నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు వివరించారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్‌ను విచారించగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, ప్రమాదం జరిగినట్లు సమాచారం ఉందన్నారు.

రుద్రూర్‌లో పట్టపగలు చోరీ

- వృద్ధురాలి ఆభరణాల అపహరణ



చెవికి గాయంతో బాధితురాలు నాగమణి



ఇంట్లో చిందరవందరగా ఉన్న సామగ్రి

రుద్రూర్: మండల కేంద్రంలో రుద్రూర్‌లో ప్రధాన రోడ్డుకు పక్కనే ఇంట్లో ఆదివారం పట్టపగలే ఓ అగంతకుడు వృద్ధురాలిపై దాడిచేసి ఆభరణాలు చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న వస్తువులు ఎత్తుకెళ్లారు. కొన్నిరోజులుగా ఆ ఇంటిని నిశితంగా పరిశీలిస్తున్న దుండగుడు చోరీ పాల్పడ్డట్లుగా స్థానికులు భావిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి (అక్బర్‌నగర్–బోధన్) పక్కనే సొంత ఇంట్లో కంచర్ల నారాయణరావ్ దంపతులు నివసిస్తున్నారు. ఆదివారం నారాయణరావ్ బయటకు వెళ్లగానే అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నగలు, వృద్ధురాలిపై ఉన్న బంగారు ఆభరణాలు తెంపుకున్నాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు ఘటనస్థలానికి రాగానే దుండగుడు పారిపోయాడు. బాధితురాలి చెవి తెగి రక్తసిక్తం కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న రుద్రూర్ సీఐ జయేశ్ రెడ్డి, ఎస్సై నీరేష్ సందర్శించి బాధితుల ద్వారా వివరాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లోచోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని శ్రీరామ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 15 తులాల బంగారం, రూ. 50 వేలు నగదు, బైక్ ఎత్తుకెళ్లిన్నట్లు బాధితుడు విఠల్ తెలిపాడు. దొల్తాపూర్ విఠల్ తన కుటుంబ సభ్యులతో శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి బాన్సువాడకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి ఓనర్ నారాగౌడ్ బంగ్లా పైకి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి విఠల్‌కు సమాచారం అందించాడు. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన ఇస్సాపల్లి ప్రవీణ్(32) మృతి చెందాడు. ముప్కాల్ ఏఎస్సై చిన్న గంగారాం తెలిపిన వివరాల ప్రకారం ప్రవీణ్ బాల్కొండ నుంచి నిర్మల్ జిల్లా పారిపెల్లి గ్రామానికి అత్తగారింటికి బైక్‌పై వెళ్తుండగా ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పై మెండోరా వైపు నుంచి వస్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ప్రవీణ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని పోలీసులు, ప్రమాద స్థలంలో ప్రత్యక్షసాక్షులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

గుంతలో పడి మహిళ మృతి



సుందర్ బాయి

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్ శివారులో నీటి గుంటలో పడి సుందర్ బాయి (50) మృతి చెందింది. ఆదివారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద పంటకు పురుగుల మందులు కొట్టడానికి వెళ్లి అక్కడే ఉన్న గుంటలో నీటి కోసం దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి గంతలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాలో వృద్ధ దంపతులపై దాడి

- స్థలాన్ని కాజేసేందుకు చూస్తున్నారని వృద్ధుల ఆరోపణ
- 10 మందిపై కేసు నమోదు



నరికివేసిన చెట్లను చూపిస్తున్న బాధిత వృద్ధులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : గత నలభై ఏళ్ల నుంచి భూమిని కొనుగోలు చేసి కబ్జాలో ఉంటున్న ఓ వృద్ధ కుటుంబం ఇంటికి వెళ్లి ఇంటి ఆవరణలో పెంచిన భారీ చెట్లను నరికి వేసి, వృద్ధులపై దాడి చేసిన ఘటన ఆదివారం ఉదయం మండలంలోని మర్కల్ గ్రామ శివారు 44వ జాతీయ రహదారి, గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ పక్కన చోటు చేసుకుంది. ఆంధ్రకు చెందిన మురళీకృష్ణ, ఝాన్సీలక్ష్మీబాయి అనే వృద్ధులు నలభై ఏళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి సర్వే నంబర్ 260/11, 260/14,260/15లలో ఉన్న మూడెకరాల భూమిని కొనుగోలు చేశామన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎకరం భూమి కోల్పోగా దానికి నష్ట పరిహారం కూడా వచ్చిందన్నారు. ఉన్న రెండెకరాల్లో తాము నివాసం ఉంటున్నామన్నారు. ఆవరణలో 20 రకాల పళ్ల చెట్లను పెంచుతున్నామన్నారు. ఇన్నేళ్లుగా లేనిది ఇప్పుడు ఆ భూమి మా గ్రామానికి చెందినదని పేర్కొంటూ మర్కల్ గ్రామస్తులు తమపై దాడికి పాల్పడి ఇంటి ఆవరణలో పెంచిన చెట్లను నరికేశారని, తమపై కర్రలతో దాడి చేశారన్నారు. ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనా వివరాలను సేకరించారు. బాధిత వృద్ధులు ఇచ్చిన ఫిర్యాదుతో మర్కల్ గ్రామానికి చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి శివారులో ఆదివారం విద్యుదాఘాతంతో మేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన చెట్కూరి రవి తన మేకల మందను తోలుకొని గ్రామ శివారులో మేపుతున్నాడు. అందులో నుంచి ఒక మేక అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మకు తగిలింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో కరెంటు వైర్లు మేకకు తగలడంతో మేక అక్కడిక్కడే మృతి చెందిందన్నారు. మేక విలువ రూ. 12వేల వరకు ఉంటుందన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి బాధితుడికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ క్రిందికి ఉండడంతో తరచుగా కరంటుషాక్ తగిలి మేకలు, గొర్రెలు మృతి చెందుతున్నాయన్నారు.